


నేటినుంచి సత్యదేవుడి దివ్య కల్యాణోత్సవాలు - 7లో
వైభవంగా భావనారాయణస్వామి కల్యాణోత్సవాలు - 7లో
ఏపీఈఏపీసెట్‌కు 1681 మంది విద్యార్థుల హాజరు - 7లో

పల్లె ప్రభం'జనం'



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పల్లెలు పోటెత్తాయి. ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఉద్యమమై కదిలాయి. సోమవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు వెల్లువలా గ్రామీణ ప్రాంతాలు తరలివచ్చాయి. ఓటుహక్కు బాధ్యతను విస్మరించకుండా బూత్‌లవద్ద ఓటర్లు బారులు తీరాయి. కనివినీ ఎరుగని రీతిలో ఒక్కటిగా కదిలి పోలింగ్‌శాతం అమాంతం పెంచేశాయి. వాస్తవానికి పట్టణ ఓటరుతో పోల్చితే పల్లెల్లో ఓటర్లు రకరకాల ఉపాధి పనులపై వెళ్లి ఎప్పుడోగానీ ఇంటికి చేరుకోరు. తద్వారా పోలింగ్‌శాతం కొంత తక్కువగా ఉంటుంది. కానీ ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో గ్రామాలు దండెత్తాయి. ఓట్లు వేయడానికి ఉరకలెత్తాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో 200కుపైగా బూత్‌ల్లో 90శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. మరో 700కుపైగా బూత్‌ల్లో 80శాతానికి మించి ఓట్లు నమోదయ్యాయి. జిల్లాలోనే అత్యధికంగా జగ్గంపేట, తుని నియోజకవర్గాల్లో రెండు బూత్‌ల్లో ఏకంగా 96శాతం పోలింగ్ జరగడంతో ఏస్థాయిలో పల్లెలు ఓటుతో దండెత్తాయో ఊహించుకోవచ్చు. అటు ఓటుహక్కు వినియోగంపైనా, ఓటు చైతన్యంపైనా పల్లెల్లో అధికారులు పెద్దగా ప్రచారం చేయకపోయినా గ్రామీణ ఓటర్లు తమ ఓటుహక్కును భారీగా వినియోగించుకోవడం విశేషం. అటు పోటెత్తిన ఓటింగ్ తమకు కలిసి వస్తుందని టీడీపీ అంచనాకు రాగా, ప్రభుత్వ వ్యతిరేకత తమను ముంచేస్తోందన్న భయం వైసీపీని వణికిస్తోంది.

వెల్లువలా కదిలారు..

జిల్లాలో సోమవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ 80.30శాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 16,34,122మంది ఓటర్లు ఉండగా, ఇందులో పదిలక్షలకుపైగానే ఓటర్లు గ్రామీణ ప్రాంతానికి చెందినవారని అంచనా. పట్టణాలతో పోల్చితే పల్లెల్లో ఓటర్లు భారీగా తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఏమాత్రం బాధ్యత విస్మరించకుండా బాధ్యతతో ఓటేశారు. పట్టణ ఓటర్లతో పోల్చితే బూత్‌లకు భారీగా దండెత్తారు. దీంతో పోలింగ్‌శాతం భారీగా నమోదవడానికి కారణమైంది. ఈ ఎన్నికల్లో మున్సిపల్ ప్రాంతాల్లో అత్యధికంగా మండపేట, పిఠాపురంలో మాత్రమే 83నుంచి 85శాతం వరకు అక్కడక్కడా పోలింగ్‌శాతం నమోదైంది. కానీ గ్రామాల్లో మాత్రం ఏకంగా పలుచోట్ల 96శాతానికి చేరుకోవడం గ్రామీణ ఓటర్లలో చైతన్యాన్ని చాటుతోంది. ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా జగ్గంపేట నియోజకవర్గంలో కృష్ణవరంలోని 121వ బూత్‌లో 96.75శాతం పోలింగ్ జరిగింది. సీతారాంపురంలోని 122వ బూత్‌లో 96.55శాతం నమోదై రికార్డు సృష్టించింది. జిల్లా మొత్తం మీద ఏడు నియోజకవర్గాల్లో అత్యధిక పోలింగ్ ఈ రెండు చోట్లే నమోదైంది. ఆ తర్వాత తుని నియో జకవర్గం పరిధిలోని తుని రూరల్ రాజుపేట బూత్‌లో 96శాతం పోలింగ్ జరిగింది. ఒకరకంగా చెప్పాలంటే 96శాతం పోలింగ్‌తో జిల్లాలో మూడు బూత్‌ల్లో ఓట్ల వెల్లువ జరిగింది. నియోజకవర్గాలవారీగా పల్లె ఓటర్ల ప్రభంజనం పరిశీలిస్తే అత్యధికంగా పిఠాపురం నియోజకవర్గంలో భారీస్థాయిలో పోలింగ్ జరిగింది. ఒకరకంగా ఇక్కడ పవన్ పోటీచేస్తున్న నేపథ్యంలో ఓటర్లు వెల్లువలా కదిలారు. ఫలితంగా ఏకంగా 48 బూత్‌ల్లో పోలింగ్ 90శాతం దాటిపోయింది. అత్యధికంగా ఏడు బూత్‌ల్లో ఏకంగా 94శాతంమంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ప్రధానంగా గొల్లప్రోలు రూరల్‌లో 20,21, 26, 28 బూత్‌లు, పిఠాపురం రూరల్‌లో 69(92%), 71,72, 73(93%), 75(93%), 76,77,81, 82(94.36%), 83,84, 85(92%), 88(93%) 90(93.56%), పిఠాపురం రూరల్‌లో 96(94.19%), 102,103, 109,117, 118(94.05%), 119, 120, 121, 123, 122, 136, 151, 155, 159, పిఠాపురం పట్టణంలో 176, యు.కొత్తపల్లిలో 187, 192, 193, 194, 203, 209, 210(93.15%), 211(94.88%), 216, 217, 218(94.83%), 219(94%), 227, 242 బూత్‌ల్లో 90శాతం నుంచి 94శాతం వరకు ఓట్ల ఉప్పెన నమోదైంది.

ఆ రెండు బూత్‌ల్లో ఓట్ల సునామీయే..

జగ్గంపేట నియోజకవర్గంలో 38 పోలింగ్‌స్టేషన్లలో 90నుంచి 96శాతానికి పైగా ఓట్లు నమోదయ్యాయి. బూత్ నెంబరు 2, 26, 30, 31(93.27%), 32, 39, 40, 41(94.20%), 48, 54, 69, 75, 105, 112, 113, 121(96.75%), 122(96.55%), 123, 124, 125, 126, 127, 128, 130, 132, 134, 144, 167, 186, 187, 191, 192, 193, 196, 209, 247, 248 బూత్‌ల్లో 90శాతానికిపైగా ఓట్లు పోలయ్యాయి. పిఠాపురం తర్వాత అత్యధిక బూత్‌ల్లో ఈస్థాయి ఓట్ల వెల్లువ జగ్గంపేటలోనే నమోదయ్యాయి. ప్రధానంగా కృష్ణవరంలోని 121వ బూత్‌లో 96.75శాతం ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ మొత్తం 584ఓట్లకు 565 ఓట్లు పోలయ్యాయి. మహిళల ఓట్లు 293కి 283, పురుషుల ఓట్లు 291కి 282 పడ్డాయి. 122వ నెంబరు బూత్ సీతారాంపురంలో 637మంది ఓటర్లకు 615మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు 336 మందికి 324, మహిళా ఓటర్లు 301కి 291మంది ఓట్లేశారు. తుని నియోజకవర్గంలో 29 బూత్‌ల్లో 90శాతానికిపైగా ఓటింగ్ జరిగింది. అత్యధికంగా తుని రూరల్ పరిధిలోని రాజుపాలెంలో 76వ నెంబర్ బూత్‌లో 96శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ బూత్ పరిధిలో 1,129మంది ఓటర్లకు 1,084మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో 26బూత్‌ల్లో 90శాతం పోలింగ్ దాటిపోయింది. కాండ్రకోటలో 17నుంచి 20వ బూత్ వరకు 90శాతం దాటగా, 21వ బూత్‌లో 95.19శాతం పోలింగ్ జరిగింది. బోయినపూడిలో 174వ బూత్‌లో 94.84%, 123లో 94.43శాతం నమోదైంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 9, 43, 67, 77, 79 బూత్‌ల్లో 90నుంచి 93శాతం పోలింగ్ జరిగింది. కాకినాడ రూరల్‌లో 7, 20 బూత్‌ల్లో 90నుంచి 94.24శాతం వరకు పోలింగ్ జరిగింది. అత్యల్పంగా కాకినాడ రూరల్‌లో 60వ బూత్‌లో 29.75శాతం నమోదైంది. కాగా ఇంతభారీగా ఓటింగ్ జరిగిన బూత్‌ల్లో తమకు అత్యధిక మెజార్టీ ఖాయమని టీడీపీ అభ్యర్థులు ధీమాగా కనబరుస్తున్నారు. అటు వైసీపీ అభ్యర్థులు మాత్రం ఇంత ఓటింగ్ ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమే లెక్కలతో ఓటమి భయంతో వణుకుతున్నారు.

- జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటెత్తిన పల్లెలు
- గ్రామీణ ప్రాంతాల్లో 200కుపైగా బూత్‌ల్లో 90శాతానికిపైగా పోలింగ్
- 700కుపైగా బూత్‌ల్లో 80శాతం మించి పోలింగ్
- జగ్గంపేట, తుని నియోజకవర్గాల్లో రెండు బూత్‌ల్లో ఏకంగా 96శాతం దాటిన వైనం
- ఓటు చైతన్యంపై పెద్దగా ప్రచారం లేకపోయినా బాధ్యత విస్మరించని గ్రామీణ ఓటర్లు



ఎన్నికల రోజున తుని నియోజకవర్గంలో ఓటు వేసేందుకు మండుటెండలో వేచి ఉన్న ఓటర్లు

హైస్కూల్ ప్లస్..
హడావుడి చదువులు



- వసతుల లేమి.. నాసిరకం బోధన
- దిగజారిన ఇంటర్ ఫలితాలు

కరప, మే 17: విద్యార్థి తాను కలగన్న జీవితాశయాన్ని నెరవేర్చుకోవడానికి పునాదిగా భావించే ఇంటర్ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ పేరుతో ఫుల్‌స్టాప్ పెట్టింది. వసతుల లేమి.. నాసిరకం విద్యా బోధన.. వెరసి విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేస్తోంది. ప్రభుత్వ నిర్వాకంవల్ల హైస్కూల్ ప్లస్‌లో చదివిన విద్యార్థుల ఇంటర్ ఫలితాలు ఈసారి మరింత దిగజారిపోయాయి. హైస్కూల్ ప్లస్ అమలు చేసిన పాఠశాలల్లో టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులను ఇంటర్ కూడా ఇక్కడే చదివేలా బోధనా సిబ్బంది బలవంతం చేశారు. వద్దని తల్లిదండ్రులు వారించినా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒత్తిడి చేసిమరీ వారు చేరేలా చేశారు. ఇప్పుడు వచ్చిన ఫలితాలను చూసి అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా ఇంటర్ విద్య అమలు చేసి విద్యార్థుల భవితను కాలరాసే హక్కు ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల చదువులతో ఆటలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 51 హైస్కూళ్లలో 2022లో ఈ ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు. అంతంతమాత్రం వసతులు ఉన్న హైస్కూళ్లలో హడావిడిగా ఇంటర్మీడియట్ పెట్టి విద్యార్థుల చదువులతో ఆటలాడుకుంటున్నారు. అరకొర సదుపాయాలు, అధ్యాపకుల నాసిరకం బోధన, సైన్స్ పాఠాలను ప్రయోగపూర్వకంగా బోధించే సరైన ల్యాబ్‌లు లేకపోవడం, ప్రభుత్వం పుస్తకాలను సమకూర్చకపోవడం.. తదితర కారణాలతో విద్యార్థుల చదువు కుంటుపడింది. కాకినాడ జిల్లాలోని హైస్కూల్ ప్లస్‌తోపాటుగా ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థుల ఉత్తీర్ణత ఈ ఏడాది నిరాశాజనకంగా ఉంది. జిల్లాలో 2,007మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా వారిలో కేవలం 703మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. రెండోఏడాది పరీక్షలను 1,645మంది రాయగా వారిలో 823మంది గట్టెక్కారు. కరప హైస్కూల్‌లో 36మంది మొదటి సంవత్సరం పరీక్షలు రాస్తే వారిలో నలుగురు మాత్రమే పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షను 12మంది రాస్తే వారిలో ఒక్కరంటే ఒక్కరు కూడా ఉత్తీర్ణత సాధించలేకపోయారు. పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి హైస్కూల్ ప్లస్‌లో ఫస్ట్ ఇంటర్‌ను 11మంది రాస్తే ఒక్కరూ కూడా ఉత్తీర్ణత సాధించలేదు. ప్రత్తిపాడు మండలం లంపకలోవ హైస్కూల్ ప్లస్‌లో 21మంది ఫస్ట్ ఇంటర్ పరీక్ష రాయగా అందరూ ఫెయిలయ్యారు. ఇలా ఆయా హైస్కూల్ ప్లస్ పాఠశాలలు రెండేళ్లుగా ఘోర ఫలితాలను చవిచూస్తున్నాయి. అయినా విద్యాశాఖాధికారులు కనీసం పట్టించుకోవడంలేదు. ఇకనైనా ప్రభుత్వ యంత్రాంగం మొద్దునిద్ర వీడి విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దేలా హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు. అనుభవం, సామర్థ్యం కలిగిన లెక్చరర్లను నియమించి ఉన్నత విద్యాబోధన అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మే 17: కాకినాడ పార్లమెంటు పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న ఈవీఎంల భద్రతపట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్‌మీనా, రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ హరీష్‌గుప్తా ఇతర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి శుక్రవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం కాన్ఫరెన్స్‌హాల్‌నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సాధారణ ఎన్నికలు 2024లో భాగంగా ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల భద్రత, సెక్యూరిటీ సిబ్బంది, సీసీటీవీ కెమెరాలు, బారికేడ్ల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని ఈవీఎంల భద్రతను, నిఘా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్ పరిశీలించేందుకు కనీసం రెండు రాజకీయపార్టీల అభ్యర్థులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు లేదా ఏజెంట్లు స్ట్రాంగ్ రూమ్ భద్రతను పరిశీలించేందుకు వీలుగా సీసీటీవీ కెమెరాలు వ్యూపాయింట్‌ను జేఎన్‌టీయూ క్యాంటీన్ పైన స్ర్కీన్ ఏర్పాటు చేశామన్నారు. దీన్ని పరిశీలించేందుకు అభ్యర్థులకు అవకాశం కల్పించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ పరిశీలనకు వచ్చిన అభ్యర్థుల వివరాలు లాగ్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. లెక్కింపు టేబుల్స్, బారికేడ్లు, ఏసీలు, ఇంటర్నెట్, డిస్‌ప్లే బోర్డులు, భోజనం, వసతి, సిబ్బంది శిక్షణ కార్యక్రమాలు తదితర ఏర్పాట్లపై ఆర్వోలు ప్రత్యేక దృష్టిపెట్టి సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, శిక్షణా కలెక్టర్ భావన, తుని ఆర్వో రామలక్ష్మి, ప్రత్తిపాడు ఆర్వో శ్రీనివాసరావు, కాకినాడ రూరల్ ఆర్వో ఇట్ల కిషోర్, పెద్దాపురం ఆర్వో సీతారామారావు, కాకినాడ పట్టణ ఆర్వో వెంకటరావు, జగ్గంపేట ఆర్వో ఎం.శ్రీనివాసరావు, జిల్లా సమాచారశాఖ డీడీ నాగార్జున, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాబురావు, ఏడీ సర్వే లక్ష్మీనారాయణ, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన జేసీ

జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి శుక్రవారం కాకినాడ జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామాగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. ఎన్నికల అధికారులతో కలిసి అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాటు పరిశీలన

జేఎన్‌టీయూలో భద్రపరిచిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లవద్ద భద్రత, నిఘా వ్యవస్థ, ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ జె.నివాస్, ఎస్పీ సతీష్‌కుమార్, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి శుక్ర వారం పరిశీలించారు. కాకినాడ నియోజకవర్గానికి సంబంధించి జేఎన్‌టీయూ సివిల్ ఇంజనీరింగ్ బ్లాకువద్ద ఉన్న ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు నిమిత్తం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. కాకినాడ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకటరావు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

వారంతే..

- జిల్లాలో మొత్తం ఓటర్లు 16లక్షల34వేల122మంది
- ఓటు వేయని వారు 3,21,876మంది
- తీరుమారని కొందరు ఓటర్లు
- పట్టణ ఓటర్ల తీరు మరీ దారుణం



సామర్లకోట, మే 17: ప్రజాస్వామ్యంలో ఓటు విలువ గురించి ఎవరు ఎంతలా మొత్తుకుంటున్నా ఇంకా అనేక మందిలో మార్పు రావడం లేదు. వందలు, వేలు కాదు. లక్షల మంది ఈ ఎన్నికల్లో ఓటుకు దూరంగా ఉండిపోయారు. మనకెందుకులే అనే ధోరణి తో వ్యవహరించారు. జిల్లాలో మొత్తం 16లక్షల 34వేల122మంది ఓటర్లు ఉండగా ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 3,21,876 మంది ఓటు వేయలేదు. ఎందరో ఓటర్లు అర్ధరాత్రి వరకూ వరుసల్లో నిల్చుని తమ ఓటుహక్కు వినియోగించుకోగా కొందరు మేధావులు సైతం ఓటుహక్కు వినియోగించుకోలేదు. తమ అమూల్యమైన ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేందుకు దేశ, విదేశాల నుంచి వందలాది మంది స్వగ్రామాలకు తరలి రావడం చూశాం. కూర్చొనేందుకు కూడా శరీరం సహకరించని వృద్ధు లు ఓటేసిన దృశ్యాలు కనిపించాయి. అయినా కొందరిలో చలనం రావడం లేదు. ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఓ వైపు ఎన్నికల కమిషన్, మరోవైపు అధికార యంత్రాంగం, మీడియా, సోషల్ మీడియా ప్రచారం చేస్తున్నా ఆశించిన ఫలితం కనిపించకపోవడంపై అధికార యంత్రాంగం ఆశ్చర్యపడుతోంది.

కాకినాడ సిటీ, రూరల్లో అత్యధికంగా..

కాకినాడ జిల్లాలో కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, పెద్దాపురం, పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాలు ఉన్నాయి. తాజాగా ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్‌కు దూరంగా ఉన్న ఓటర్ల సంఖ్య ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలో అన్ని నియోజకవర్గాల కన్నా మేధావులు అధికంగా ఉన్న జిల్లా ప్రధాన కేంద్రం అయిన కాకినాడ సిటీలో 67,254మంది, కాకినాడ రూరల్‌లో 67,497 మంది తమ ఓటుహక్కు వినియోగించుకోలేకపోవడం గమనార్హం. పెద్దాపురం నియోజకవర్గంలో 38,108మంది ఓటర్లు, పిఠాపురంలో 31,601మంది, ప్రత్తిపాడులో 42,487మంది, జగ్గంపేటలో 37,574మంది, తునిలో 37,355మంది ఓటర్లు ఓటు వేయలేదు. ఫలితంగా చట్టసభల్లోకి అడుగుపెట్టాల్సిన అర్హులైన అభ్యర్థులు ఇంటికే పరిమితమయ్యే ప్రమాదంతో పాటు స్వప్రయోజనాల కోసం ఎన్నికల బరిలో ఉన్న వ్యక్తులు చట్టసభల్లోకి అడుగుపెట్టే అపాయమూ పొంచి ఉంది.

కాకినాడ జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటింగ్

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైనఓట్లు	వేయని వారు
కాకినాడ సిటీ	2,41,620	1,74,987	67,254
కాకినాడ రూరల్	2,69,330	2,01,833	67,497
పెద్దాపురం	2,15,095	1,76,987	38,108
పిఠాపురం	2,36,409	2,04,808	31,601
ప్రత్తిపాడు	2,17,267	1,74,780	42,487
జగ్గంపేట	2,29,863	1,92,289	37,574
తుని	2,24,538	1,87,183	37,355

కాలువలు ఇలా..
ఖరీఫ్ ఎలా?



తుని మండలం హంసవరం వద్ద మట్టిని తరలించేందుకు పుష్కర కాలువను మూసివేసిన వైసీపీ నాయకులు

- అస్తవ్యస్తంగా పంట కాలువలు
- తరుముకొస్తున్న ఖరీఫ్ సీజన్
- సాగునీటి కోసం రైతుల్లో ఆందోళన

తుని రూరల్, మే 17: తునిలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే పుష్కర, పంపా సాగునీటి కాలవల నిర్వహణ కొరవడి అస్తవ్యస్తంగా మారాయి. తుని రూరల్ గవరపేటవద్ద కాలువను పొదలు కప్పేశాయి. అధికారులు వీటి వైపు కన్నెత్తి చూడకపోవడంతో సాగునీటి కాలువల పరిస్థితి దయనీయంగా మారింది. పలుచోట్ల అధికార పార్టీ నాయకులు అడ్డగోలు వ్యవహారాలకు నిబంధనలకు విరుద్ధంగా కాలువలను కప్పేసిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మరో 15రోజుల్లో ప్రారంభం కానుంది. రుతుపవనాలు మూడురోజులు ముందే ప్రవేశిస్తాయని వాతావరణశాఖ ద్వారా తెలుస్తోంది. దీంతో వచ్చే ఖరీఫ్ సీజన్‌పై రైతులు కోటి ఆశలతో ఉన్నారు. ఈసారైనా వాతావరణం అనుకూలించి సకాలంలో వర్షాలు కురిసి ఏ ఇబ్బందులు లేకుండా వ్యవసాయం సాగాలని కోరుకుంటున్నారు. మేలో ఎన్నికలు రావడంతో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రణాళిక తయారీ, అనుమతుల మంజూరు కొంత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఖరీఫ్‌కు సంబంధించి పంటల సాగు, విత్తనాలు, ఎరువులు లభ్యత, పంట రుణాల పరిస్థితి తదితరన అంశాలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎన్నికల సంఘం పర్యవేక్షణలో ఖరీఫ్ ప్రణాళికకు ఆమోదం తెలపాల్సి ఉంది. జూన్‌లో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తిస్థాయి ఆమోదం తెలిపే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.




ఎస్టీయూ ఉద్యమ శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి రామకృష్ణ

ఉపాధ్యాయులే ప్రభుత్వం కళ్లు తెరిపించాలి!

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజానగరం, మే 17: అపరిష్కృత సమస్యల సాధన కోసం ఉపాధ్యాయులే ప్రభుత్వం కళ్లు తెరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గైట్ కళాశాలలో రెండ్రోజులపాటు జరిగే రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర స్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామకృష్ణ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ప్రసంగించారు. మన రాష్ట్రంలో కులానికో కార్పొరేషన్ ఏర్పాటుచేసి పదవులు పందారం చేసినా, ఆ పదవి పొందినవారు కారుకు పెద్ద బోర్డు తగిలించుకోవడం తప్ప ఎటువంటి ఉపయోగం లేదన్నారు. దీనిపై తాను ప్రశ్నించగా అలాగే అలా బోర్డు ఏర్పాటుచేస్తే టోల్‌గేట్ వద్ద టోల్ అడగరన్న సమాధానం వచ్చిందన్నారు. మోదీని ఇంటికి, వైసీపీని ఇడుపులపాయకు పంపాలన్నదే తమ నినాదమన్నారు. చంద్రబాబు సీఎం అయితే ఇంత దుర్మార్గంగా మాత్రం ఉండదని, ప్రజాస్వామ్యం పరిఢవిల్లకపోవచ్చుగానీ ఆయన ఇంటికి వెళ్లి కనీసం ప్రశ్నించే అవకాశం అయినా ఉంటుందని ఒక ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ విద్యారంగం తాజా పరిస్థితులపై మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రధానోపాధ్యాయులకు ఈవెంట్ మేనేజర్లుగా నైపుణ్యం ఇచ్చారంటూ ఛలోక్తి విసిరారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల దైనందిన కార్యక్రమం సెల్‌ఫోన్‌తోనే ప్రారంభమవుతోందన్నారు. విద్యానిలయాల్లో విద్యకు ప్రాధాన్యం లేకుండా అప్రధానమైన విషయాలకే ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ప్రాథమిక పాఠశాలల్లోని కొన్ని తరగతులను విలీనం ద్వారా పల్లెబడులకు మంగళం పాడారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఉపాధ్యాయ వాణి ప్రధాన సంపాదకుడు జి.నాగేశ్వరరావు, సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు జాకబ్, ఆర్థిక కమిటీ సభ్యుడు ఈశ్వరరెడ్డి, తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డానియేల్‌బాబు, లక్ష్మణ, దొరబాబు, పల్లంరాజు, మోర్త శ్రీను, కాశీ విశ్వనాథ్, నాయకులు ఎస్‌జే త్రినాథ్‌బాబు, పి.సుబ్బరాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



నేటి నుంచి సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలు

- తొలిరోజు పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా స్వామి, అమ్మవార్లు
- 19వ తేదీ రాత్రి దివ్యకల్యాణం
- 24 రాత్రి శ్రీపుష్పయాగంతో ముగింపు
- వారం రోజులూ నిత్యం వివాహ వేడుకలు, కొండ దిగువ ఊరేగింపు
- ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నూతన పెద్దరథంపై ఊరేగింపు


సత్యదేవుడి కల్యాణం (ఫైల్)

అన్నవరం, మే 17: రత్నగిరివాసుడైన సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మి అమ్మవారిని పరిణయమాడే వేళ సమీపిస్తోంది. ప్రతిఏటా వైశాఖ శుద్ధ ఏకాదశి రోజున సత్యదేవుడి దివ్యకల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుండగా క్రోధి నామసంవత్సర కల్యాణోత్సవ వేడుకలు ఈసారి మే 18న ప్రారంభమై 24తో ముగియనున్నాయి. దీనికి దేవస్థానం అధికార యంత్రాంగం రూ.50 లక్షలను వెచ్చిస్తూ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపకాంతులతో దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. శనివారం సాయంత్రం సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా భక్తులను అనుగ్రహిస్తారు. స్వామి, అమ్మవార్ల వివాహ కార్యక్రమానికి క్షేత్రపాలకులు సీతారాములు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు. కల్యాణమహోత్సవాలు వారంరోజులు కొండపై పెండ్లి వేడుకలు, దిగువన వాహనసేవలు నిర్వహిస్తారు.

18న: వేకుజామున సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరణ, రాత్రి 7 గంటలకు కళామందిరంలో ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 9 గంటలకు కొండదిగువన వెండి ఆంజనేయవాహనంపై సీతారాముల గ్రామోత్సవం జరుగుతుంది.

19న: సుప్రభాతసేవ, ఉదయం 9 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, కంకణధారణ, రాత్రి 7గంటలకు కొండ దిగువన వెండి గరుడవాహనంపై పెండ్లికొడుకైన సత్యదేవుడు, వెండి గజవాహనంపై అనంతలక్ష్మి అమ్మవారు వెండి పల్లకీలో సీతారాముల ఊరేగింపు, గ్రామోత్సవం ఉంటుంది.

20న: సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, సాయంత్రం 5 గంటలకు ప్రధాన ప్రవేశస్థాలిపాక హోమాలు, రాత్రి 7గంటలకు అరుంధతీ నక్షత్రదర్శనం, రాత్రి 9 గంటలకు కొండదిగువన రావణబ్రహ్మ వాహనంపై నవదంపతుల గ్రామోత్సవం.

21న: సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, మధ్యాహ్నం 2.30కి అనివేటి మండపంలో క్షేత్రపాలకుల సీతారాముల సమక్షంలో సరస్వతీపూజ, పండిత సదస్యం, వేదశాస్త్ర సభ, పండిత సత్కారం రాత్రి 9గంటలకు కొండ దిగువన పొన్నవాహనంపై నవదంపతులకు గ్రామోత్సవం.

22న: సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, సాయంత్రం 4గంటలకు కొండ దిగువన నవదంపతులకు వనవిహార మహోత్సవం. సాయంత్రం 5 గంటల నుంచి నూతన పెద్ద రథంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు జరుగుతుంది.

23న: సుప్రభాతసేవ, శేషహోమాలు, కొట్నాలు, గౌరీపూజను ఉదయం 5గంటలకు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు పంపా సరోవరంలో చక్రస్నానం, సాయంత్రం 4 గంటలకు నీలలోహిత గౌరీపూజ, నాకబలి, దండియాడింపు, ధ్వజావరోహణ, కంకణ విమోచన ఉంటుంది.

24న: సుప్రభాతసేవ, చతుర్వేదపారాయణలు, రాత్రి 7.30కి కొండపై నిత్యకల్యాణమండపంలో శ్రీపుష్పయాగం. పేరంటాళ్లకు దంపతీతాంబూలాలు, రవిక వస్త్రాల వితరణ ఉంటుంది.



సత్యదేవుడి కల్యాణం నిర్వహించే వార్షిక కల్యాణ వేదిక... నూతన టేకు రథం





వాతావరణంలో మార్పులతో సముద్రతీరంలో శుక్రవారం సాయం సంధ్యవేళ ఆకాశం మేఘావృతమై బంగారు కాంతులతో కనువిందు చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఎస్.రామేశ్వరం, ఓడలరేవు తీరాల్లో ఈ దృశ్యాలు కట్టిపడేశాయి. ముఖ్యంగా సముద్రంలో ఇంద్రధనస్సు ఆకట్టుకుంది. - అల్లవరం



ఆలమూరు మండలం మూలస్థానం వద్ద జాతీయ రహదారిపై ప్రమాద దృశ్యం.. నాగరాజు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఆలమూరు/ఆత్రేయపురం మే17: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన బర్రే నాగరాజు (25) మోటారు సైకిల్‌పై మూలస్థానం బయల్దేరాడు. ఇందిరాకాలనీ వైపు వెళ్లడానికి డివైడర్ దాటుతుండగా అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు ఆలమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ర్యాలి వెంకటేశ్వరనగర్‌కు చెందిన బర్రే సత్యనారాయణ-నాగమణి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడైన సతీష్ ఏసీ మెకానిక్. అతడికి ఏడు నెలల కిందట మూల స్థానం అగ్రహారానికి చెందిన అమ్మాయితో వివాహమైంది. చిన్న కుమారుడైన నాగరాజు తాపీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అత్తవారింట్లో ఉన్న సతీష్ తమ్ముడికి ఫోను చేసి ఏసీ రిపేరింగ్‌కు సంబంధించి పార్టు తెమ్మన్నాడు. దానికి తీసుకుని బయల్దేరిన నాగరాజు మూల స్థానం వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. దీంతో ర్యాలిలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాద వార్త తెలిసిన వెంటనే మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

కిడ్నాప్ కేసులో ఏడుగురి అరెస్టు

మలికిపురం, మే17: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రామరాజులంకలో ముందుగా ఓటువేసే విషయమై ఘర్షణ పడిన నేపథ్యంలో ఒక వ్యక్తిని ఏడుగురు కిడ్నాప్ చేశారు. మలికిపురం ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 13న ఎన్నికల్లో రామరాజులంకలో ఓటు వేసే విషయమై రేకపల్లి నాగరాజు, నార్ని పద్దయ్యలు ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. దీంతో పద్దయ్య మనుమడు, అతని స్నేహితులు కలసి అదే రోజు సాయంత్రం రేకపల్లి నాగరాజును కిడ్నాప్ చేశారు. నాగరాజు మర్నాడు తప్పించుకుని ఇంటికి చేరాడు. కాగా కిడ్నాప్‌కు వాడిన కారును, నార్ని వీర వెంకటశివప్రసాద్ (రామరాజులంక), ఇందుగుల గోపాలస్వామి(గూడపల్లి), కొంబత్తుల వికాస్ (కేశనపల్లి), ఇందుగుల సాయిగణేష్ (గూడపల్లి), కాపిశెట్టి వెంకటసత్యకృష్ణప్రసాద్ (నాని)(గూడపల్లి), తోరం దుర్గాకిరణ్ (గూడపల్లి), కటికిరెడ్డి దుర్గాశ్రీనివాస్ (గూడపల్లి)లు ఏడుగురినీ అరెస్టుచేసి కోర్టుకు పంపినట్టు మలికిపురం ఎస్ఐ తెలిపారు.


న్యూయోమ్ టెక్నాలజీస్ సీఈవోతో సమావేశమైన పద్మరాజు

న్యూయోమ్‌తో కలసి పనిచేయబోతున్నాం

నన్నయ ఉపకులపతి పద్మరాజు

దివాన్‌చెరువు, మే 17: భావితరం విద్యార్థుల అభ్యాస కార్యక్రమాలు, వివిధ అంశాల్లో ఆవిష్కరణల కోసం అత్యుత్తమ సెంటర్‌ను రూపొందించడంలో బెంగళూరులోని న్యూయోమ్ టెక్నాలజీస్ కంపెనీతో కలసి పనిచేయబోతున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. న్యూయోమ్ వ్యవస్థాపకుడు, సీఈవో, ఎండీ డాక్టర్ వంగల రజనీకాంత్‌తో నన్నయ వర్సిటీ అధికారులు శుక్రవారం సమావేశమయ్యారు. వర్సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి న్యూయోమ్ సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు అభ్యాసనా కార్యక్రమాలు, వ్యవస్థాపకత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్‌లెర్నింగ్ వంటి అంశాల్లో ఆవిష్కరణలకోసం ఈ సెంటర్‌ను రూపొందించనున్నామన్నారు. విద్యార్థులకు సాధికారత కల్పించడం, విద్యార్థినులు, పారిశ్రామికవేత్తలపై కూడా దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్లేస్మెంట్ అధికారి బి.జగన్మోహనరెడ్డి, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.


ఎర్రచందనం దుంగలు సీలేరు నదిలో డంప్ చేసిన సన్నివేశం దృశ్యం

ముగిసిన పుష్ప2 సినిమా షూటింగ్

మోతుగూడెం, మే17: చింతూరు మండలం మోతుగూడెం లోయర్ సీలేరు ప్రాజెక్టులో మంగంపాడు, పాలగడ్డ, డొంకరాయి, పొల్లూరు పరిసర ప్రాంతాల్లో వారంరోజులుగా చిత్రీకరించిన పుష్ప2 సినిమా షూటింగ్ శుక్రవారం ముగిసింది. సీలేరు నదిలో దారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఎర్రచందనం దుంగలు సీలేరు నదిలో డంప్ చేసిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. శుక్రవారం జరిగిన కొన్ని సన్నివేశ చిత్రీకరణలో స్థానికులకు అవకాశం లభించడంతో వారు ఆనందం వ్యక్తంచేశారు. స్థానికులు అధిక సంఖ్యలో షూటింగ్ ప్రదేశానికి తరలివచ్చారు.



విశేషాలంకరణలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి.. హాజరైన మహిళా భక్తులు

వైభవంగా భావనారాయణస్వామి కల్యాణోత్సవాలు

సర్పవరం జంక్షన్, మే 17: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి సప్తాహ్నిక వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పురోహితులు స్వామివారికి సుప్రభాత సేవ, మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా పలు రకాల పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. అనంతరం సాయంత్రం స్వామివారిని శేషవాహనంపై ఉంచి తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి సమర్పించిన గరుడ పొంగలి ప్రసాదాన్ని ధ్వజస్తంభం వద్ద మహిళా భక్తులు స్వీకరించారు. ముఖ్యంగా సంతానం లేని మహిళా భక్తులు గరుడ పొంగలి ప్రసాదాన్ని ధ్వజ స్తంభం వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. సంతానం లేనివారు గరుడ పొంగలిని స్వీకరిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. శనివారం శేషవాహన సేవ కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు తెలిపారు. కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు కాకినాడ జిల్లాలో

1681 మంది విద్యార్థుల హాజరు

జేఎన్టీయూకే, మే17: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి సంబంధించి రెండో రోజు శుక్రవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 920 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 829 మంది హాజరయ్యారని, 91 మంది గైర్హాజరుకాగా 90.11 శాతం హాజరునమోదైనట్టు కన్వీనర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 927 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 852 మంది హాజరయ్యారని, 75 మంది పరీక్ష రాయలేదని. మొత్తం 91.91 శాతం హాజరు నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లకు కలిపి 1847 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1681 మంది హాజరయ్యారని 166 మంది గైర్హాజరుకాగా మొత్తం 91.01 శాతం విదార్థులు హాజరు నమోదైనట్టు కన్వీనర్ తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి పరీక్షలు ముగిశాయని, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలు శనివారం ప్రారంభమై 23 వరకూ కొనసాగుతాయన్నారు.

ఖైదీలు పరివర్తన చెందాలి

సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్

రాజమహేంద్రవరం, మే17(ఆంధ్రజ్యోతి): ఖైదీలు చెడు వ్యసనాలను దూరం చేసుకొని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకొనే విధంగా పరివర్తన చెందాలని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ శ్రీరామ రాహుల్ పేర్కొన్నారు. సోషల్ ఇంక్యుబేషన్‌లో భాగంగా కేంద్ర కారాగారంలో ఖైదీల మానసిక పరివర్తనపై ఓ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఖైదీలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని సైక్రియాటిస్టులు డాక్టర్ రామారెడ్డి, డాక్టర్ నీలిమ మానసిక పరివర్తన చెందడంపై పలు సూచనలు చేశారు. చెడు స్నేహాలకు, మత్తుపదార్థాలకు బానిసలై మానసిక దౌర్బల్యంతో నేరాలకు పాల్పడ్డారని, అందువల్ల ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు మంచి చెడులను బేరీజు వేసుకొని మంచి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో డీఎస్ ఎం.రాజ్‌కుమార్, కారాగార వైద్యశాల వైద్యులు డాక్టర్ పి.కోమల, డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.


రెయిలింగ్ తీసేసి ట్రాఫిక్ దిమ్మెలు ఏర్పాటుచేసిన దృశ్యం

ఆదమరిస్తే గోదాట్లోకే..

- మరమ్మతుల పేరిట పలుసార్లు బ్రిడ్జి మూత.. చేసింది శూన్యం
- ఇప్పుడు మరోసారి తంతు.. రోడ్‌కం రైల్ బ్రిడ్జి దుస్థితి ఇది



బ్రిడ్జి పక్కన ఇనుప గ్రిల్స్ ఎట్టకేలకు ఏర్పాటు చేస్తున్న దృశ్యాలు

ఈ ఫొటోల్లో కనిపిస్తున్నది చారిత్రాత్మక రాజమహేంద్రవరం రోడ్డు కం రైలు వంతెన. దీన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్య నిర్ణయాలతో సర్వనాశనం చేశారు. మరమ్మతుల పేరిట కొన్నిసార్లు, ప్రతిపక్ష పార్టీల యాత్రలను వంతెన మీదుగా వెళ్లకుండా చేయడానికి మరమ్మతులంటూ మరికొన్నిసార్లు పెద్ద తతంగమే నడిపారు. అంతం కానిది ఆరంభం అన్న చందంగా బాగుచేసే పనులు అనేక సార్లు సాగించారు. ఆ క్రతువులో కమీషన్ల రూపంలో పెద్ద మొత్తంలో జేబుల్లో వేసుకున్నారనే విమర్శలు ఉండనే ఉన్నాయి. మరోవైపు మరమ్మతు పనుల కోసం నెలల తరబడి వంతెనపై ట్రాఫిక్ నిలిపివేసి జనాలను ఇబ్బందులకు గురిచేసినా చివరికి ఒరిగిందేమీ లేదు. వంతెన బాగుపడిందీ లేదు. పైగా మరింత ప్రమాదకరంగా తయారైంది. మరమ్మతుల కోసమంటూ ట్రాఫిక్ నిలిపివేసినా ప్రతిసారీ ధ్వంసమైన రెయిలింగ్‌లకు రంగులు వేయడం, బ్రిడ్జిపై తారురోడ్డు వేయడం వంటి వాటితో సరిపెట్టారు. అదేంటోగాని ప్రతిసారీ ప్రతిపక్షాల నేతలు ఈ వంతెనపై నుంచి వచ్చే సమయంలోనే మరమ్మతులకు తెరతీసేవారు. ఆ క్రమంలో అమరావతి రైతులనూ ఇబ్బందిపెట్టారు. ఇంతా చేసి వంతెన మరమ్మతులను మాత్రం ఈనాటికీ పూర్తిచేయలేకపోయారు. అక్కడక్కడా సిమెంటు రెయిలింగ్‌ని తీసేసి ఇనుప కమ్మెలతో రెయిలింగ్ ఏర్పాటుచేస్తున్నారు. భద్రత దృష్ట్యా ఈ పనులు అత్యంత వేగంగా జరగాల్సి ఉండగా అవి నత్తతో పోటీపడుతున్నాయి. ఇప్పుడు రెయిలింగ్ తీసేసిన చోట ఇదిగో ఇలా ట్రాఫిక్ సిమెంటు దిమ్మలను ఏర్పాటుచేశారు. దీంతో ఈ ప్రదేశం అత్యంత ప్రమాదకరంగా తయారైంది. అదుపు తప్పితే పాదచారులు సైతం గోదావరిలోకి పడిపోవాల్సిందే. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల అలసత్వాన్ని వెక్కిరిస్తోంది. రాజమహేంద్రవరానికి ఈ వంతెన ఆసియాలోనే ఒక ప్రత్యేక పేరును నిలిపితే.. అటు ప్రభుత్వం, ఇటు యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం వహించడం పట్ల జనాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

- రాజమహేంద్రవరం/ఆంధ్రజ్యోతి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, మే 17: సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు లైన్ల మరమ్మతుల్లో భాగంగా 11 కేవీఏ ఫీడర్లలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఏవీఎస్‌డీఎస్.ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. బళ్ల మార్కెట్, విఘ్నేశ్వరా థియేటర్ ప్రాంతం, వీర్రాఘవపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

చట్టసభల్లోకి వర్మ కచ్చితంగా అడుగుపెడతారు

జనసేన అధినేత పవన్‌కల్యాణ్

పిఠాపురం, మే 17: పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ భవిష్యత్తులో కచ్చితంగా చట్టసభల్లోకి అడుగుపెట్టి ప్రజల తరపున పనిచేస్తారని బలంగా నమ్ముతున్నట్టు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాను పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నానని తెలియగానే ఎంతో బలమైన క్యాడర్ ఉన్నప్పటికి తన సీటు త్యాగం చేసి సంపూర్ణ మద్దతు ప్రకటించిన వర్మకు, వారి కార్యకర్తలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. తానే అభ్యర్థి మాదిరిగా కష్టపడి పనిచేశారని కితాబునిచ్చారు. ఈ ఎన్నికల్లో వర్మ అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. రానున్న రోజుల్లో పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం వర్మ అనుభవాన్ని వినియోగించుకుంటూ కలిసికట్టుగా ముందుకు వెళ్లతామని చెప్పారు. నిండునూరేళ్లు ఆయన ఆయురారోగ్యాలతో ప్రజాజీవితంలో కొనసాగాలని, శ్రీపాదశ్రీవల్లభుల ఆశీస్సులు వర్మపై ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు పవన్ తెలిపారు.

'టీమ్ అట్లాంటా సేవలు అభినందనీయం'

జనసేన సిద్ధాంతాలకు మద్దతుగా టీమ్ అట్లాంటా జనసేన(తాజ్) అందించిన సేవలు అభినందనీయమని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా జనసేనకు విరాళాలు అందించడంతో పాటు వివిధ పరికరాలు సమకూర్చారని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో తన తరపున గణనీయమైన సేవలు అందించారని తెలిపారు. నా సేన నా వంతు కార్యక్రమంలో ప్రతి నెలా భాగస్వాములు అయ్యారని చెప్పారు. ఖండాంతరాలు అవతల ఉన్నప్పటికి పుట్టిన భూమికి తన వంతుగా సేవ చేయాలనే దృఢసంకల్పంతో ముందుకు వచ్చి విజయం కోసం మేము సైతం అంటూ పాటుపడిన తాజ్ టీమ్‌కు ఆయన అభినందనలు తెలిపారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా భద్రరావు

కాకినాడ క్రైం, మే 17: కాకినాడ బార్ అసోసియేషన్ 2024-25కుగాను జరిగిన ఎన్నికల్లో అన్ని పదవులు ఏకగ్రీవం కాగా ఉపాధ్యక్ష పదవికి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది కేవీ భద్రరావు భారీ మెజారిటీతో ఎన్నికయ్యారు. మొత్తం 980 ఓట్లకుగాను 680 ఓట్లు పోల్ అయినట్లు ఎన్నికల అధికారి టీపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. భద్రరావుకు 440 ఓట్లు రాగా, అతని ప్రత్యర్థి సూదిన శ్రీనివాస్‌కు 236 ఓట్లు రావడంతో భద్రరావు 204 ఓట్ల భారీ ఆధిక్యతతో గెలుపొందినట్లు ఆయన వివరించారు. ప్రస్తుత కార్యవర్గంలో అధ్యక్షుడిగా ముత్తింటి విశ్వేశ్వరరావ్, కార్యదర్శిగా చెక్కా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా పాశం శంకర్ శ్రీనివాస్, కోశాధికారిగా బహదూర్‌షా, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా డి.అశోక్‌కుమార్, లైబ్రరీ సెక్రటరీగా కె.దయానందరావ్, సూపర్ సీనియర్ కమిటీ సభ్యుడిగా ఏవీసీహెచ్ఎస్ఎన్ మూర్తి, సీనియర్ కమిటీ సభ్యుడిగా దుర్గాప్రసాద్, లేడీ రిప్రజెంటేటివ్‌గా జి.నాగసునీత, లేడీ కమిటీ మెంబర్లుగా ఎం.సరోజిని, ఉమాగౌరి, బిందుశ్రీ, కమిటీ మెంబర్లుగా కె.ఏడుకొండలు, బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు.

రేపు టీడీపీ ఆత్మీయ సమావేశం

సర్పవరం జంక్షన్, మే 17: కాకినాడ రూరల్ నియోజకవర్గం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఆదివారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ కోఆర్డినేటర్, రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకోవడం జరిగిందన్నారు. ఎన్డీయే కూటమి పొత్తులో భాగంగా కాకినాడ రూరల్ అసెంబ్లీ సీటు జనసేనకు కేటాయించడంతో ఆపార్టీ అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించారన్నారు. జనసేన అభ్యర్థి విజయం సాధించడం కోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరిని అభినందించి సంఘీభావం తెలిపి, భవిష్యత్తులో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సర్పవరం జంక్షన్ సమీపంలో పాత ట్రస్ట్ ఆసుపత్రి ఎదురుగా గల ఖాళీ స్థలంలో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

20 నుంచి పోలేరమ్మ జాతర

కాకినాడ సిటీ, మే 17: కాకినాడ పర్లోవపేట మత్స్యకార ప్రాంతంలో అనాదిగా జరుపుకుంటున్న శ్రీ పోలేరమ్మ అమ్మవార్ల జాతర ఈనెల 20 నుంచి జూన్ 5 వరకు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక పర్లోవపేటలో శుక్రవారం సాయంత్రం పోలేరమ్మ జాతర కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. 20న సాయంత్రం సినిమారోడ్‌లక్ష్మీథియేటర్ ప్రాంతం నుంచి ఊరేగింపు ప్రారంభమై కల్పన సెంటర్, సాంబమూర్తినగర్ బ్రిడ్జి, డెయిరీఫారమ్ సెంటర్, సంజయ్‌నగర్ మీదుగా పర్లోవపేటలోని ఉత్సవాల ప్రాంగణానికి చేరుకుంటుందని సభ్యులు తెలిపారు. ఊరేగింపులో తప్పెటగుళ్లు, గారడీ, కాళికా నృత్యం, తీన్‌మార్, అలంకరించిన వాహనాల్లో వివిధ వేషధారణలు, సౌండ్‌తో కూడిన లైటింగ్ ఉంటాయన్నారు. రాత్రి 10 గంటల నుంచి మర్నాడు 21 ఉదయం 6 గంటల వరకు జాగారం జరుగుతుందన్నారు. అనంతరం 26న ఆడవి సత్తెమ్మతల్లి ఉత్సవం, 29న అగ్ని గుండం, 30న ఎల్లారమ్మ ఉత్సవం, జూన్ 5న ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఏ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన బందోబస్తు కల్పించాలని కమిటీ సభ్యులు తుమ్మల కొండలరావు, తుమ్మల రమేష్, దిబ్బాడ పెదబాబు, పొట్టి భానుబాబు, పి.పోలరాజు తదితరులు సంతకాలతో కూడిన వినతిని కాకినాడ డీఎస్పీకి అందజేశారు.

వరుస దొంగతనాలతో ప్రజలు ఆందోళన

జగ్గంపేట, మే 17: ఇటీవల జగ్గంపేట మండలంలో వరుసగా బైక్ దొంగతనాలతో పాటు చిల్లర దొంగతనాలు ఎక్కువయ్యాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో గల ఒక ఇంట్లో బుల్లెట్ బైక్‌ను దొంగలించారు. మండలంలోని జె.కొత్తూరు-రాజపూడి మధ్య గల షాపుల వద్ద పార్కింగ్‌చేసిన పల్సర్ బండిని తీసుకెళ్లడంతో పాటు బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద డబ్బుతోవచ్చిన మహిళను మోసం మేమే సిబ్బంది అంటూ బ్యాంక్‌లో ఓచర్లు రాస్తామంటూ నటిస్తూ రూ.70వేలతో పరారైన సంఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ నాగార్జునరాజు మాట్లాడుతూ ఈ దొంగతనాలపై బ్యాంకుల వద్ద సీసీ ఫుటేజ్ పరిశీలించామని, త్వరలోనే నిందితులను అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

'నాడు-నేడు పనులు పూర్తి చేసేందుకు కృషి'

సామర్లకోట, మే 17: మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో అమలులో ఉన్న నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్పీలు కృషిచేయాలని ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య పి.పుల్లయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్పీలతో సమీక్షా సమావేశం శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అందరు ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలని, ఈ నెల 18 నుంచి అన్ని పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయించేందుకు కృషి చేయాలన్నారు. మండల, పట్టణ పరిధిలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

'శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలి'

సామర్లకోట, మే 17: పట్టణ ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ జిల్లా కలెక్టర్ నివాస్‌కు వీడియో సందేశం ద్వారా శుక్రవారం ఫిర్యాదు చేశారు. ప్రతీ వేసవిలోనూ మున్సిపల్ అధికారులు పట్టణ పజల తాగునీటి సమస్యపై ఎంతమాత్రం శ్రద్ధ కనబర్చకపోవడం వల్లే ఈ దుస్థితి ఉంటుందన్నారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.

ఇంకా అమలులో ఎన్నికల కోడ్ : సీఐ

గండేపల్లి, మే 17: ఎన్నికల కోడ్ ఇంకా అమలులో ఉందని ఎవరూ ఎటువంటి గొడవలకు దిగరాదని జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని జెడ్.రాగంపేటలో సీఐ, ఎస్ఐ రామకృష్ణ, రాజస్థాన్ కేంద్ర బలగాలతో సందర్శించారు. సీఐ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ దృష్ట్యా జాగ్రత్త వహించాలని పలు సూచనలు చేశారు. అనంతరం పిల్లలకు క్యారమ్,చెస్ బోర్డులు పంపిణీ చేశారు.

జె.అన్నవరంలో అన్నదానం

ఏలేశ్వరం, మే 17: మండలంలోని జె.అన్నవరంలో శుక్రవారం గుబ్బాలమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. అమ్మవారికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఉమ్మిడి వెంక ట్రావు, కూరాకుల రాజా, ఏనుగు ధర్మరాజు, పతివాడ వెంకటేశ్వరారవు, ఏనుగు సుబ్రహ్మణ్యం పూజలు చేసి నైవేద్యాలు పెట్టి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

కొత్తపల్లి, మే 17: మూలపేటలో కాకినాడ సెజ్ ప్రాంతంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం(డబ్ల్యుఎస్‌డీసీ)లో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న 25 మంది మహిళలకు శుక్రవారం కాకినాడ సెజ్ ప్రాజెక్టు సీనియర్ మేనేజర్ దామకూ వీరన్న సర్టిఫి కెట్లు అందజేశారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ స్థానిక మహిళా నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా మహిళలకు తగిన నైపుణ్యాన్ని అందించే ఉద్దేశ్యంతో కుట్టుపని, చీర పెయిం టింగ్, డిజైనర్, బ్లౌజులు కుట్టడంలో శిక్షణ ఇచ్చి వారు ఆర్థికంగా ఎదగడానికి అరబిం దో సేవలు ప్రశంసనీయమని వీరన్న అన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన మహిళలు

ఎవరికి కలిసొచ్చేనో..!

కాకినాడ సిటీలో పెరిగిన పోలింగ్ శాతం

ఆయా పార్టీల నేతల గెలుపు లెక్కలు

కాకినాడ సిటీ, మే 17: ఈ సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలో పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి కలిసొచ్చేనో అనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది.. గడచిన రెండు సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ఈ దఫా రికార్డు స్థాయిలో 72.16 శాతం పోలింగ్ నమోదైంది. గత 2019 సార్వత్రిక ఎన్నికల్లో 66.38 శాతం నమోదు కాగా, అంతకు ముందు 2014 సార్వత్రిక ఎన్నికల్లో 67.05 శాతం నమోదైంది. దీంతో గత 2019 ఎన్నికలతో పోలిస్తే గణనీయంగా 5.78 శాతం పోలింగ్ పెరిగింది. ఇప్పుడు ఈ పెరిగిన పోలింగ్ శాతం మీద రాజకీయ పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. ప్రాంతాలవారీగా పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలిస్తూ ఆయా పార్టీల నేతలు గెలుపు లెక్కలు వేస్తున్నారు. పోలింగ్ రోజు నుంచి జోష్ మీద ఉన్న టీడీపీ కూటమి కాకినాడ సిటీలో 20 నుంచి 25 వేల మధ్య మెజారిటీ వస్తుందని అంచనా వేస్తున్నాయి. అదే విధంగా వైసీపీ కూడా 15 వేల వరకు మెజారిటీ వస్తుందని భావిస్తోంది. కాకినాడలోని 233 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,15,5559 మంది పురుష ఓటర్లు, 1,25,958 మంది మహిళ ఓటర్లు, 103 మంది ఇతరు ఓటర్లు కలిపి మొత్తం 2,41,620 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 83,668 మంది పురుష ఓటర్లు, 90,624 మంది మహిళ ఓటర్లు, 64 మంది ఇతర ఓటర్లు మొత్తం 1,74,356 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 72.41 శాతం పురుషులు, 71.94 శాతం మహిళలు, 62.14 శాతం ఇతరులు కలిపి మొత్తం 72.16 శాతం ఓటింగ్ నమోదైంది. పెరిగిన పోలింగ్ శాతం ప్రభుత్వ వ్యతిరేక ఓటా, సంక్షేమ ఓటా అనేది ఎవరికి వారు లెక్కలు వేస్తున్నారు. టీడీపీ, జనసేనకు పట్టు ఉన్న దుమ్ములపేట, పర్లోవపేట, సంజయ్‌నగర్, జగన్నాథపురం, ఏటిమొగ, గోలీలపేట, ముత్తానగర్, యాళ్లవారి గరువు, యానాం రోడ్, అన్నమ్మఘాటీ, నరసింహరోడ్, పాతబస్టాండ్ ఏరియా, కచేరీపేట, ఎల్విన్‌పేట, రామారావుపేట రామకృష్ణారావుపేట, రేచెర్లపేట, సాంబమూర్తినగర్, కొత్త కాకినాడ వంటి ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలలో 70 శాతం దాటి పోలింగ్ జరిగింది. దుమ్ములపేట, ఏటిమొగ, పర్లోవపేట, అన్నమ్మఘాటీ, పాతబస్టాండ్, రేచెర్లపేట తదితర ప్రాంతాల్లో 80 శాతం దాటి పోలింగ్ నమోదైంది. బీజేపీకి పట్టున్న రామారావుపేట, గాంధీనగర్ ప్రాంతాల్లో గణనీయంగా పోలింగ్ శాతం పెరిగింది. అనేకచోట్ల ఉదయం 6 నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. కొన్ని చోట్ల పోలింగ్ పూర్తయ్యేసరికి రాత్రి 9 గంటల సమయం దాటింది.

రూరల్ రూలర్‌పై ఉత్కంఠ!

కరప, మే 17: కాకినాడరూరల్ నియోజకవర్గం ఏర్పడిన తరువాత నాలుగోసారి జరిగిన ఎన్నికల్లో గెలుపుపై ప్రధానపార్టీల అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. రూరల్‌లో గెలిచి సత్తా చాటాలని భావిస్తున్న కూటమి అభ్యర్థి పంతం నానాజీ ఎన్నికల ఫలితాల కోసం ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు. పోలింగ్ సరళిని బట్టి రూరల్ సీట్‌ను భారీ మెజార్టీతో గెలుస్తున్నామని కూటమి నాయకులు కరాకండీగా చెపుతున్నారు. 70శాతం పైబడి పడిన ఓసీ సామాజిక వర్గం ఓట్లతో బాటు బీసీ, ఎస్సీ సామాజికవర్గం ఓటర్లు కూడా ఓటేశారనే అంచనాతో కూటమి నాయకులు విజయధరహాసంతో ఉన్నారు. ఇదిలా ఉండగా ముచ్చటగా మూడోసారి గెలిచి నియోజకవర్గంలో తన పట్టును నిలుపుకోవాలని వైసీపీ అభ్యర్థి కురసాల కన్నబాబు తహతహలాడుతున్నారు. దీంతో ఆయా పార్టీల నాయకులు బూత్‌లవారీగా పడిన ఓట్లు ఎవరికి అనుకూలమో లెక్కలు వేసుకుంటూ గెలుపు అంచనాలను రూపొందించుకుంటున్నారు.

కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కాకినాడ రూరల్, కరప మండలాలతో బాటు కాకినాడఅర్బన్‌లోని 1, 2, 3, 47, 48, 49, 50 డివిజన్‌లు ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో మొత్తం 2,69,330మంది ఓటర్లు ఉండగా వారిలో మహిళలు 1,33,475మంది, పురుషులు 1,35,847మంది, ఇతరులు 8మంది ఉన్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో 74.94 శాతం అంటే 2,01,833మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో 74.09శాతం మేర ఓట్లు పడగా ఈ దఫా 0.85 శాతం ఓట్ షేర్ పెరిగింది. దీనికి తోడు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు సుమారు 6వేలు వరకు పడ్డాయి. అలాగే పెరిగిన ఓట్ల శాతం కూడా తమకు అనుకూలమనే భావనలో కూటమి నాయకులు ఉన్నారు. అయితే వైసీపీ నాయకులు ఈ వాదనలను తోసిపుచ్చుతున్నారు. పెరిగిన ఓట్లు ప్రభుత్వంపై అనుకూలతకు తార్కాణమని చెబుతున్నారు. టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి శక్తివంచన లేకుండా చేసిన ప్రచారం కూటమి అభ్యర్థి విజయావకాశాలను మెరుగుపర్చిందని పలువురు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బెట్టింగ్‌రాయుళ్లు పందేలు కాయడానికి ఉత్సుకత చూపిస్తున్నారు. గ్రామాల వారీగా ఏ పార్టీకి ఎంత మెజార్టీ వస్తుందనే దానిపై ప్రధానంగా బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఏదిఏమైనా కాకినాడరూరల్‌లో రూలర్ ఎవరనేది తెలియాలంటే ఎన్నికల ఫలితాలు వెలువడే జూన్ 4వ తేదీ వరకు వేచిచూడాల్సిందే.

తునిలో ఎవరి లెక్కలు వారివే!

తుని రూరల్, మే 17: గతంలో కన్నా ఈ సారి పోలింగ్ శాతం పెరిగింది. ఇది బాగా మాకు కలిసివస్తుంది. ఇక మా గెలుపు నల్లేరుమీద నడకే ఇది ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు ఎవరికి వారు ఎన్నికల ఫలితాలపై లెక్కలు వేస్తున్నారు. తునిలో పోలైన ఓట్లు వివరాలు బూత్‌ల వారీగా తెప్పించుకుని రాజకీయ విశ్లేషకులతో ఆరా తీస్తున్నారు. తునిలో ప్రధానంగా 2 పార్టీల మధ్య హోరాహోరీ పోరు సాగింది. గతం కంటే ఈ సారి ఓటింగ్ శాతం బాగా పెరిగింది. 83.36శాతం పెరగడంతో తమకంటే తమకు లాభిస్తుందని ప్రధాన పార్టీలు భావిస్తున్నారు. విజయావకాశాలపై ఎడ తగ్గకుండా కూడికలు, తీసివేతలతో మునగలేస్తున్నారు. ఒకటిన్నర శాతం ఓట్లు అధిక్యంగా గెలుపు ఖాయమని ఎవరికి వారే ఢంకా బజాయిస్తున్నారు.



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ముదునూరిని సస్పెండ్ చేయాలి

ప్రత్తిపాడు, మే 17: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అమలాపురం నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు (మురళీరాజు)ను సస్పెండ్ చేయాలని ప్రత్తిపాడు మండల టీడీపీ పార్టీ డిమాండ్ చేసింది. శుక్రవారం సాయంత్రం ప్రత్తిపాడులో జిల్లా టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు స్వగృహం వద్ద మండల సమావేశం నిర్వహించారు. మండలాధ్యక్షులు అమరాది వెంకట్రావు, పల్లాగోపి, బొల్లు కొండబాబు, ఇంధన ఏసుబాబు, దాట్ల అప్పన్నబాబు మాట్లాడుతూ మే 13న జరిగిన ఎన్నికల్లో టీడీపీకి మురళీరాజు ద్రోహం చేశారని ఆరోపించారు. ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సత్యప్రభ కోసం పనిచేయకుండా వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల కోసం మురళీరాజు డబ్బులు పంచారని... సత్యప్రభకు ఓటు వేయవద్దని గ్రామాల్లో ప్రలోభాలకు పాల్పడ్డారని వారు ఆరోపించారు. ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసి పార్టీ నుంచి పొందిన పదవులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి దానం శేషారావు కూటమి అభ్యర్థికి వెన్నుపోటు పొడిచిన మురళీరాజుపై అధిష్ఠానం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు జింకల తాతారావు, లొండా లోవరాజు, కొప్పుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ కలెక్టర్ సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ట్రైనీ కలెక్టర్ భావన

కార్పొరేషన్ (కాకినాడ), మే 17: ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన శుక్రవారం కాకినాడ నగర పాలక సంస్థ కార్యాలయంలోని వివిధ విభాగాధిపతులతో సమావేశమయ్యారు. కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శాఖల వారీగా కార్యకలాపాలను సమీక్షించారు. ట్రైనీ కలెక్టర్ విభాగాలవారీగా ఆయా శాఖ పనితీరు, విధివిధానాలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎస్ఈలు పి.సత్యకుమారి, పి.వెంకటరావు, ఈఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏవో శిరీష్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

చినరాజప్ప ప్రత్యేక పూజలు

సామర్లకోట, మే 17: మాజీ హోంమంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కుటుంబసభ్యులతో కలిసి మహారాష్ట్రలోని కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన చినరాజప్ప తదితర కుటుంబసభ్యులకు మహారాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వినయ్‌కోరే, సమిత్‌లు సాదరంగా ఆహ్వానించి ఆలయ సత్కారాలు చేశారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన రాజప్ప తెలుగు ప్రజలందరీ జీవితాలు ఆనందైశ్వర్యాలతో ఉండేలా ఆశీర్వదించమని కోరుకున్నట్లు తెలిపారు. రాజప్పను ఆలయ మర్యాదలతో పండితులు సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. చినరాజప్ప వెంట తనయుడు రంగనాగ్, వ్యాపారవేత్త హర్ష గ్రంధి, సత్యనారాయణ రాజులు ఉన్నారు.



కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే చినరాజప్ప

సరైన ఆహారపు అలవాట్లతో రక్తపోటుకు చెక్

డీఎంహెచ్‌వో నరసింహనాయక్

జీజీహెచ్ (కాకినాడ), మే 17: ఉప్పు వాడకాన్ని తగ్గిస్తూ సరైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా రక్తపోటుకు చెక్ పెట్టవచ్చని జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సదస్సుతోపాటు శుక్రవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అనంతరం మీ రక్తపోటును కచ్చితంగా కొలవండి దాన్ని నియంత్రించండి, ఎక్కువ కాలం జీవించండి అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రక్తపోటు వల్ల వచ్చే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకర జీవన ప్రమాణాలు అలవర్చుకోవడం, శారీరక వ్యాయామం చేయడం, ఉప్పు వాడకాన్ని తగ్గించడం, యోగా ధ్యానం వంటివి చేయడం ద్వారా రక్తపోటును నియంత్రించవచ్చన్నారు. రక్తపోటు బారిన పడిన వారు క్రమం తప్పకుండా వైద్యులు సూచించిన మందులు వాడుతూ ప్రతి 15రోజులకు వైద్యపరీక్షల చేయించుకోవడం ద్వారా బ్రెయిన్ స్ట్రోక్, గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీవ్యాధులు, రెటినోపతి వ్యాధుల నుంచి నివారణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, డీఎల్‌వో డాక్టర్ ఆర్.రమేష్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఐ.ప్రభాకర్, డాక్టర్ స్వప్న, డాక్టర్ సురేఖ, డాక్టర్ రవికుమార్, డెమో ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న డీఎంహెచ్‌వో బృందం

ఆహారపు అలవాట్లతో నియంత్రణ

గొల్లప్రోలు, మే 17: ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్చుకోవడం ద్వారా రక్తపోటును నియంత్రించుకోవచ్చని వైద్యులు తెలిపారు. ప్రపంచ రక్తపోటు(బీపీ) నివారణా దినోత్సవం సందర్భంగా గొల్లప్రోలు పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, రోగులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. క్రమం తప్పకుండా బీపీ చెకప్ చేయించుకోవాలని, పొగాకు, మద్యం తదితర అలవాట్లకు దూరంగా ఉండాలని వైద్యులు చెప్పారు. ఆనందకరమయిన ఆహ్లాదకర వాతావరణంతో బీపీ అదుపులో ఉంటుందని తెలిపారు. ఆకుకూరలు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. గొల్లప్రోలు వైద్యాధికార్లు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సునీత మెర్సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధిక రక్తపోటుతో ముప్పు

ప్రత్తిపాడు, మే 17: అధిక రక్తపోటుతో ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదమని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు సౌమ్య చెప్పారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులు, ఉద్యోగులతో రక్తపోటు నివారణా ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరు బీపీని అదుపులో ఉంచుకునేందుకు ప్రయత్నించాలని, బీపీ కంట్రోల్‌లో లేకపోతే ఆరోగ్యం దెబ్బతినేప్రమాదం ఉందన్నారు.

అవగాహన అవసరం

తొండంగి, మే 17: రక్తపోటుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. ఏవినగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆయన మాట్లాడుతూ రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలని.. తగిన మందుల ఆహార నియమాలు పాటిస్తూ వ్యాధి నుంచి వచ్చే దుష్పరిణామాలనుంచి రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భారతి ఉన్నారు.

ముగిసిన వేసవి ఉచిత శిక్షణా తరగతులు

పిఠాపురం, మే 17: పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని బావనరావు సభాసదన్‌లో సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో 2వారాలు పాటు జరిగిన వేసవి ఉచిత శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. శిక్షణలో అత్యుత్తమ ప్ర తిభ కనబరిచిన 12మంది విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు, మరో 70మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, పుస్తకాలను అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో 584 మార్కులు సాధించిన టౌన్ ఫస్ట్‌గా నిలిచిన పిఠాపురం మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని జి.మహాలక్ష్మి, 582 మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచిన అదే పాఠశాల విద్యార్థిని డి.తేజో అమృతను, 579 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన బాదం మాదవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎం.అఖిలను, వారి తల్లిదండ్రులు, హెచ్ఎంలను సత్కరించారు. వారందరికి చక్రధర్ ఎడ్యుకేషనల్ వేల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెన్నపు చక్రధరరావు నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, శిక్షణా తరగతుల ప్రిన్సిపాల్ పోతుల శ్రీనివాస్, ఉపాధ్యాయుడు కామరాజు, మండలి ప్రధాన కార్యదర్శి సీహెచ్.సతీష్, మహిళా కార్యదర్శి పి.పావని, అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, భాష్యం ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు వి.సత్యనారాయణరెడ్డి, గట్టి శ్రీకృష్ణదేవరాయులు, విశ్రాంత ఎంఈవో వరదా వీరభద్రరావు, దాడి పద్మనాభం, మేకా మన్మథరావు, సమత జిల్లా కన్వీనర్ చల్లా ఉమారాజమంగతాయారు, కరుణకుమార్,గంగబాబు,నాగేంద్రప్రసాద్ ఉన్నారు.



పిఠాపురంలో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

కాకినాడలో...

కార్పొరేషన్ (కాకినాడ), మే 17: కాకినాడ నగర పరిధిలో వివేకానంద పార్క్‌ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ యోగా కేంద్రంలో మే 1న ప్రారంభించిన పిల్లల వేసవి యోగా శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో వేసవి సెలవుల్లో కుటుంబంలో పెద్దవాళ్లు చెప్పే కథలు, పురాణాలతో బాగా గడిచేవని ఇప్పుడు సెల్‌ఫోన్, ఇంటర్నెట్ ప్రభావం పిల్లలపై చెడు ప్రభావం చూపకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, శిక్షకులను అభినందించారు. చైర్మన్ రామారావు మాట్లాడుతూ 2017 నుంచి నిరాటంకంగా ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కె.శివకుమార్, సంస్థ సభ్యులు పి.పద్మజవాణి, సీహెచ్ సుశి ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి : డీఎస్పీ

పిఠాపురం రూరల్, మే 17: శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని, వివాదాలకు దూరంగా ఉండాలని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు సూచించారు. విరవాడలో శుక్రవారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ రోజున జరిగిన చిన్న చిన్న వివాదాల నేపథ్యంలో ఎటువంటి ఘర్షణలకు దిగవద్దన్నారు. ప్రస్తుతం సీఆర్‌పీసీ సెక్షన్ 144కింద నిషేధాజ్ఞలు, సెక్షన్ 30పోలీసుయాక్టు అమలులో ఉందని చెప్పారు. విరవ, విరవాడ, ఎఫ్‌కేపాలెం గ్రామాలకు చెందిన యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్, పట్టణ ఎస్ఐ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సత్యప్రభకు అభినందనలు



సత్యప్రభను కలిసిన టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు, మే 17: ప్రత్తిపాడు టీడీపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజాకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం చినశంకర్లపూడి, చింతలూరు, శృంగవరం, పెదఅగ్రహారం, మెరక సోమవారం, పోతులూరు, పెదశంకర్లపూడి, ఏలూరు తదితర గ్రామాలకు చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ప్రత్తిపాడు తరలివచ్చి సత్యప్రభను అభినందించారు. టీడీపీ నాయకులు మిరాయల శ్రీను, వెంకట్రాజు, బుక్కా సత్తిబాబు, ఏలూరు సర్పంచ్ రొంగల సత్యనారాయణ, అడ్డాల త్రిమూర్తులు, సూర్నీడి సురేష్, జింకల తాతారావు, పోల్నాటి భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

పాదగయలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పూజలు



రక్షారామయ్య దంపతులకు వేద ఆశీర్వచనాలు

పిఠాపురం, మే 17: పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని కర్నాటక రాష్ట్రంలోని చిక్‌బల్లాపూర్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రక్షా రామయ్య శుక్రవారం సందర్శించారు. పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి సతీసమేతంగా పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ప్రసాదాలు అందజేశారు.

నేత్రదానం



సుబ్బలక్ష్మి(ఫైల్)

తాళ్లరేవు, మే 17: పి.మల్లవరం గ్రామానికి చెందిన వుంగరాల సుబ్బలక్ష్మి(55) శుక్రవారం ఆకస్మిక మరణం చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో సామాజిక కార్యకర్త దూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో కాకినాడ బాదం బాలకృష్ణ ఐబ్యాంక్‌కు సుబ్బలక్ష్మి నేత్రాలను దానం చేశారు. ఐబ్యాంక్ సిబ్బంది కార్నియాలను సేకరించారు. సుబ్బలక్ష్మి కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో జనసైనికుడు మృతి

గొల్లప్రోలు రూరల్, మే 17: గొల్లప్రోలు మండలం వన్నెపూడి సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జనసైనికుడు మృతి చెందాడు. చెందుర్తి గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త చెప్పుల నానిబాబు (33) గురువారం రాత్రి వన్నెపూడి సెంటర్ నుంచి మోటార్‌సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన నానిబాబును తొలుత ప్రత్తిపాడు, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

గండేపల్లి, మే 17: మండలంలో జడ్.రాగంపేట ఆదిత్య ఆసుపత్రి వద్ద శుక్రవారం జాతీయ రహదారిపై అదుపు తప్పి బైక్ పడిపోవడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు రావాల్సి ఉంది.

గండేపల్లి సర్వసభ్య సమావేశం

గండేపల్లి, మే 17: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సర్వసభ్య సమావేశం ఎంపీడీవో హనుమంతరావు ఆధ్వర్యంలో తూతూమంత్రంగా సాగింది. ఏ నిర్ణయాలు తీసుకోకుండా, తీర్మానాలు చేయకుండా సమావేశాన్ని ముగించారు. పేరుకే సమావేశం అనేలా జరిపించేశారు.

22న సర్వసభ్య సమావేశం

రౌతులపూడి, మే 17: ఈ నెల 22న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎమ్.ప్రేమసాగర్ శుక్రవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు హాజరుకావాలన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఏలేశ్వరం, మే 17: ఏలేశ్వరంలో యూత్ క్రికెట్ మెమోరియల్ టోర్నమెంట్ ప్రారంభించారు. శుక్రవారం జూనియర్ కళాశాల ఆవరణలో స్నేహితులు దుర్గారావు, సుధీర్ జ్ఞాపకార్థం రోజుకు మూడు టీమ్‌లతో సుమారు 10రోజుల పాటు 36 టీమ్‌లతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు క్రికెట్ యూత్ సభ్యులు తెలిపారు. విన్నర్ ట్రోఫీకి రూ.33,333, రన్నర్ ట్రోఫీకి రూ.22,222 నగదుతోపాటు బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ బౌలర్, మేన్ ఆఫ్ ది సిరీస్‌లకు మెమోంటోలు అందజేస్తామన్నారు.

బంగారు, వెండి పుష్పాలతో అర్చన

పెద్దాపురం, మే 17: మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చనను శుక్రవారం ఘనంగా నిర్వహించి భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. దేవస్థానం వేద పండితుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు.